క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు

కృత్తివెన్ను: మండల పరిధిలోని కృత్తివెన్ను పంచాయతీ సీతనపల్లి స్లోపు వద్ద గల అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.ఊరేగింపులో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహిళాభక్తులు హారతులతో స్వాగతం పలికారు.

28న మోపిదేవి ఆలయం హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ సమక్షంలో కానుకల లెక్కింపు జరుగుతుందని వివరించారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చునని తెలిపారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకుడు చిరువోలు బుచ్చిరాజు చల్లని మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. మండు టెండల్లో భక్తులకు, ప్రయాణికులకు మజ్జిగ అందించడంపై దాతలను అభినందించారు. అవనిగడ్డ ఆర్టీసీ డీఎం కె.హనుమంతరావు, ఎంపీటీసీ కొమ్ము పవన్‌కుమార్, కోసూరు రామాంజనేయులు, పూర్వ సంఘం ప్రతినిధులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే



కోడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని టీచర్లు కోరారు. అనంతరం చిన్నారులతో గ్రామ పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా జెడ్పీటీసీ బలరాం వర్ధంతి



చల్లపల్లి: దివంగత జెడ్పీటీసీ తాతినేని రామకృష్ణ(బలరాం) వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బలరాం విగ్రహానికి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, బలరాం సోదరుడు తాతినేని సాయి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వక్కలగడ్డ పంచాయతీ పరిధిలో బలరాం విస్తృతంగా మొక్కలు నాటించి సంరక్షించారని అన్నారు. ఆయన కృషి ఫలితంగా నేడు వక్కలగడ్డ పంచాయతీ మొత్తం పచ్చని మొక్కలతో అలరారుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయునికి సత్కారం



పెడన: ఉపాధ్యాయ వృత్తిలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజంలో గుర్తుండే వ్యక్తులు ఉపాధ్యాయులేనని ఎంఈఓ శ్రీహరనాథ్ అన్నారు. మండలంలోని చేవెండ్ర జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు చిలంకుర్తి సాంబశివరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కార కార్యక్రమం జరిగింది. హెచ్ఎం రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ సాంబశివరావు సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సాంబశివరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు లెనిన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం..

- కనులపండువగా వెంకన్న కౌతుకోత్సవం
- ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు
- స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన ఉభయదాతలు



ప్రత్యేక అలంకారంలో శ్రీనివాసుడు



ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేస్తున్న పండితులు



స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఉభయదాతలు

కోడూరు: కలియుగ వైకుంఠ దేవుడైన కల్యాణ వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగుతున్నాయి. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మంత్రోచ్చరణ నడుమ యాగశాలలో ప్రత్యేక హోమాలు చేశారు. కోడూరుకు చెందిన ప్రముఖ వ్యాపారులు యిమ్మడి రాంబాబు, వెంకట రామకృష్ణప్రసాద్ (చిన్ని) దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కౌతుకోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. నవకలశ స్నాపన ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక జలాలతో స్వామివార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మంగళవారం రాత్రి ప్రధాన సెంటర్‌లో స్వామివారి రాయబారోత్సవాన్ని నిర్వహించారు. ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి వ్యాఖ్యాతగా వ్యవహరించి, స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లోని ప్రధాన ఘట్టాలను, విశిష్టతను అనుగ్రహభాషణ చేశారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

స్వామివార్లకు పట్టువస్త్రాల సమర్పణ

కల్యాణోత్సవానికి ఉభయదాతలుగా వ్యవహరించే యిమ్మడి రాంబాబు, రామకృష్ణప్రసాద్ దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. తమ నివాసగృహాల వద్ద నుంచి మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన రహదారి పొడవునా చలువ వస్త్రాలపై నడుచుకుంటూ వచ్చి పట్టువస్త్రాలను పండితులకు అందించారు. రాత్రి కల్యాణం అనంతరం గురువారం వాహన సేవలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. ప్రధానార్చకుడు దుంబాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనులపండువగా రంగనాయకుని కల్యాణం



కల్యాణోత్సవాల్లో పాల్గొన్న దంపతులు



బ్రహ్మం గారి నాటక ప్రదర్శనలో ఓ ఘట్టం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో ఉన్న శ్రీ రంగనాయకస్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తమ్మన సోమశేఖర పవన కుమార్ – కృష్ణవేణి, నూకల బాబూరావు – దేవి, కొప్పుల శ్రీరంగరాధాకృష్ణ – కమలకుమారి, వేములపల్లి మధుసూదనరావు – సుప్రియ దంపతులు పీటలపై కూర్చున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ముత్తేవి శ్రీనివాసాచార్యులు, వంశపారంపర్య అర్చకుడు ముత్తేవి దివ్యసీత రామ శేషకుమార్, యాజ్ఞికులు ఖండవిల్లి అభిరామ్ ఆధ్వర్యంలో కల్యాణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం

శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జగజ్జ్యోతి కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భోగాది మస్తానరావు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నాపురం శ్రీ బాలసరస్వతి నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకంలో సిద్ధుడు, అదంబి సీన్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. సిద్ధుడిగా కళాకారుడు జన్ను నారాయణరావు తదితర కళాకారులు చేసిన నటనను పలువురు అభినందించారు.


ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తనలు



స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తమండళ్ల సభ్యులు

కోడూరు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి భక్తమండళ్ల సభ్యులు నిర్వహించిన అన్నమాచార్యుల సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కడవకొల్లు రాము బృందం సభ్యులతో కలిసి అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. వెంకన్న నామాలు, శ్రీనివాసుడి మహిమను వివరిస్తూ వివిధ రకాల భక్తిగీతాలు, పద్యాల రూపంలో స్వామివారి చరిత్రను వివరించారు. కోడూరు, నక్కవానిదారి గ్రామాలకు చెందిన మహిళా భక్తమండళ్లు ఆలపించిన స్వామివారి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు.

నయనానందకరం శ్రీనివాసుడి అలంకారం





కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మల్లెపూలతో స్వామివారి మూలమూర్తులకు చేసిన అలంకారం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఆలయమంతా పూలతోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ధ్వజ స్తంభం వద్ద శంఖు, చక్ర , నామాలను పూలతో అలంకరించారు. గర్భాలయంలోని మూలమూర్తులను మల్లెపూలు, కనకాంబరాలు, తులసీదళాలు, చామంతి, గులాబీలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

–కోడూరు

వారసత్వ రక్తహీనతకు వైద్య సేవలతో నివారణ



రక్తహీనత అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

బంటుమిల్లి: వారసత్వం కారణంగా సంక్రమించే రక్తహీనత వల్ల వచ్చే అనారోగ్యాలను వైద్య సేవలతో నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి సౌందర్య అన్నారు. బుధవారం వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ చేసి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి ఆరోగ్యాన్ని బట్టి రక్త పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేస్తామని తెలిపారు. వ్యాధిని గుర్తించేందుకు పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వ్యాధి కారణంగా స్త్రీలకు గర్భధారణ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, కళ్లు పసుపు రంగు మారడం, అలసట తదితర వ్యాధులు ఏర్పడతాయని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రావు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు కె.వీరబాబు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలోని చిత్రకళా సంసద్‌లో చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను బుధవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి కె.అప్పారావు తెలిపారు. రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కలంకారీ వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. మచిలీపట్నం, పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు చేయూతనివ్వాలని ఆయన కోరారు.

రోడ్లపై సౌండ్ బాక్స్‌లతో తిరిగితే చర్యలు

ట్రాక్టర్ల యజమానులకు ఎస్ఐ హెచ్చరిక

నాగాయలంక: మండలంలో రోడ్లపై ట్రాక్టర్లు టేపు రికార్డర్‌లు సౌండ్‌లతో తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం సాయంత్రం మండలంలోని ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇష్టానుసారం సౌండ్ పెట్టి రోడ్లు, గ్రామాల వీధుల్లో ట్రాక్టర్‌లు స్పీడ్‌గా తిరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ పనులు సీజన్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఇనుప దమ్ము చక్రాలతో రోడ్లపై తిరిగి రహదారులు ధ్వంసం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

జాబ్‌మేళాలో 215 మంది ఎంపిక



చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు సంబంధించి 16 కంపెనీలు పాల్గొన్నాయి. మేళాకు 515 మంది విద్యార్థులు హాజరుకాగా, 215 మందిని ఎంపిక చేసి, వారికి ఆఫర్ లెటర్లను అందించారు. కార్యక్రమాన్ని కరస్పాండెంట్ యార్లగడ్డ శివ ప్రసాద్, ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్‌బాబు పర్యవేక్షించగా, కాలేజీ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పంచాయతీలకు నియమితులైన సచివాలయ కార్యదర్శులు

అవనిగడ్డ: కార్యదర్శులు లేని పంచాయతీలకు సచివాలయ కార్యదర్శులను(గ్రేడ్ -5) నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 277 మందిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పంచాయతీ కార్యదర్శులుగా నియమితులైన సచివాలయ కార్యదర్శులు వీరే. ఘంటసాల మండలంలో వేములపల్లి పంచాయతీకి బి.సురేష్‌కుమార్, దేవరకోటకు సీహెచ్ కాంతారావు, తాడేపల్లికి జె.సురేఖ, పూషడంకు యు. వరప్రసాద్, గోగినేనిపాలెంకు సీహెచ్ లీలా వసుంధర, చిట్టూర్పుకు జి.నాగ శిరీష, యండకుదురుకు వై.సుబ్రహ్మణ్యం, కొత్తపల్లికి సునంద, చిలకలపూడికి ఐ.సోమయ్య, వి.రుద్రవరానికి పి.సతీష్, అచ్చెంపాలెంకు ఆర్.శ్రీనివాసరావులను నియమించారు. చల్లపల్లి మండలంలో వెలివోలు పంచాయతీకి కె.దాక్షాయణి, మోపిదేవి మండలంలో బొబ్బర్లంకకు డి.విజయలక్ష్మి, ఉత్తర చిరువోలులంకకు ఎస్.సహన, మేళ్ళమర్తిలంకకు పి.మోహనకృష్ణకుమార్, అవనిగడ్డ మండలంలోని రామకోటిపురానికి ఆది అశోక్, ఎడ్లంకకు ఎస్.శివ వెంకట రోహిత్, తుంగలవారిపాలెంకు ఆర్ఎస్ఎస్ ఫణీంద్ర, రామచంద్రపురానికి కె.సుబ్బారావు నియమితులయ్యారు. కోడూరు మండలంలోని జయపురానికి వై.నాగార్జున, పోటుమీదకు ఎ.ఓంకార్, హంసలదీవికి కె.లీలా ప్రియాంక, నాగాయలంక మండలంలో నాచుగుంటకు జి.వాసు, పెదపాలెంకు వి.కుమార్, ఈలచెట్లదిబ్బకు వి.నాగబాబు, పెదకమ్మవారిపాలెంకు వి.నారాయణ, నాలికి కె.రాంబాబు, చోడవరానికి జి.విజయకృష్ణ, వక్కపట్లవారిపాలెంకు కె.సుష్మ నియమితులయ్యారు. వీరంతా డీడీవో పవర్స్ కలిగిన రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులుగా వ్యవహరిస్తారు.

దోమల నివారణకు మందుల పిచికారీ

పెడన: పట్టణ పరిధిలో హాస్టళ్లలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ తదితర జ్వరాలు సోకకుండా ముందస్తుగా దోమల మందులు పిచికారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామయ్య తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో ఉన్న మూడు సంక్షేమ వసతి గృహాల్లో మలాథియన్ పౌడర్‌ను పిచికారీ చేయించామన్నారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి పి. మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాధ్యమైనంత మేర సాగునీరు అందించేందుకు చర్యలు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: సాధ్యమైనంత వరకూ రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. తన స్వగృహంలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు వేసవిలో చేయాల్సిన పనులకు ఎన్నికల కోడ్ వల్ల నిధులు కేటాయించలేదన్నారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఆలోచిస్తున్నారన్నారు. జిల్లాలో సాగునీటి పరిస్థితిపై రెండు, మూడు రోజుల్లో జిల్లా కలెక్టర్ సమీక్ష చేయనున్నట్టు బుద్ధప్రసాద్ తెలిపారు. సాగునీరు చాలా తక్కువగా లభ్యమైన 2002లో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్‌శాఖ సమన్వయంతో పంటకాలువలపై ప్రత్యేక గస్తీ నిర్వహించి అందరికీ సాగునీరు అందించామని గుర్తు చేశారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్, ఈఈ పీవీ కృష్ణారావు, మచిలీపట్నం డీఈ భానుబాబు, స్థానిక డీఈ రావెళ్ళ రవికిరణ్, యువనాయకుడు మండలి వెంకట్రామ్ (రాజా) పాల్గొన్నారు.

త్వరలో మోపిదేవి నుంచి హంసలదీవికి ఆర్టీసీ సర్వీసు



మోపిదేవిలో బస్సు రిక్వెస్టుకు ప్రదేశం పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం హనుమంతరావు, ఎస్ఐ సత్యనారాయణ

మోపిదేవి: నియోజకవర్గంలో ప్రధాన పుణ్యక్షేత్రాలైన మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం నుంచి కోడూరు మండలం హంసలదీవిలో వేంచేసియున్న వేణుగోపాల స్వామివారి ఆలయం వరకు ప్రతి ఆదివారం ఆర్టీసీ బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ ఆర్టీసీ డీఎం హనుమంతరావు తెలిపారు. మోపిదేవిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పుణ్యక్షేత్రాల సందర్శనార్థం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతి ఆదివారం వస్తున్నందున భక్తుల కోరిక మేరకు మోపిదేవి నుంచి హంసలదీవి వరకు ఆర్టీసీ బస్సు నడిపేందుకు అవకాశాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆది, మంగళవారాల్లో మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనార్థం వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, దేవస్థానం వద్ద బస్సులు నిలిపేందుకు స్థలం పరిశీలించినట్లు చెప్పారు. అవనిగడ్డ నుంచి వచ్చే బస్సులు ఆలయం వెలుపలి గేటు సమీపంలోనూ, చల్లపల్లి నుంచి వచ్చే బస్సులు పోలీస్ అవుట్ పోస్టు సమీపంలోనూ నిలిపేలా రిక్వెస్టు స్టాపులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అందుకు స్థానిక పోలీస్‌వారు సహకరించాలని కోరారు. ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ దేవస్థానం దగ్గర రోడ్డు పక్కకు రాకుండా షాపులను నియంత్రణ చేస్తూ ప్రతి ఆది, మంగళవారాల్లో ప్రత్యేక పోలీస్ సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, గ్రామస్తులను దృష్టిలో పెట్టుకుని మోపిదేవి నుంచి వయా వెంకటాపురం మీదుగా చల్లపల్లిని కలుపుతూ మచిలీపట్నంకు బస్సు నడపాలని ఎంపీటీసీ కొమ్ము పవన్‌కుమార్ ఆర్టీసీ డీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఎనీమియా అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, వైద్యసిబ్బంది

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రపంచ సికిల్ సెల్ (ఎనీమియా) దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి ద్వారా ప్రజల్లో కలిగే రక్తహీనతను 2047 నాటికి నిర్మూలించే లక్ష్యంతో జిల్లాలోని 0–40 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారందరికీ ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. దీంతో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లలో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎనిమియా నిర్ధారణ పరీక్షలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వ్యాధి వారసత్వంగా మాత్రమే సంక్రమిస్తుందని ఆమె తెలిపారు. రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, తరచుగా అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు మొదలైన లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి లక్షణాలు లేనప్పటికీ ప్రజలు క్రమం తప్పకుండా డాక్టర్ సలహాలు తీసుకోవటం, శరీరంలో తగినంత నీటి శాతాన్ని పాటించటం, పౌష్టికాహారం సమపాళ్లలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.సీతాకుమారి, కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌కు వినతి

అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ గొర్రుముచ్చు ఉమాకు జనసేన పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబు వినతిపత్రం సమర్పించారు. డ్రైనేజీ పూడిక తీత, గుర్రపచెరువు మంచినీటి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, సంతలో మాంసం, చేపల వ్యర్థాలు వేయకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీహరి పాల్గొన్నారు.